# గవర్నమెంటు కథలు నెం: 2



# ఉపన్యాస రామకథ

—కప్పగంతుల మల్లికార్జునరావు

యమ్మే చదివిన తనభర్త అప్పర్ డివిజన్ గుమస్తా అవుతాడని కలలో కూడా వూహించలేదు అరవింద. అదామెకు సుతరామూ యిష్టంలేదుకూడా. లక్ష విధాలుగా తన అయిష్టాన్ని సూచించింది. లక్షన్నర అభ్యంతరాలను తెలిపింది.

అయితే మురళీమోహన్ అప్పటికే స్వశక్తిమీద వుద్యోగం సంపాదించుకోవాలన్న ప్రయత్నాలు చేసి చేసి విసిగిపోయాడు. రెకమెండేషన్లు లేకుండా ఆ వుద్యోగ

మన్నా దొరికినందుకు సంతోషిం చాడు. దేశంలో యింకా ఆ మాత్రం నీతిమిగిలివున్నందుకు జన్మభూమిని అభినందించేడు.

భర్త అంత అల్ప సంతోషి కావటము అరవిందకు నచ్చలేదు.

పుట్టటమైతే అరవింద పల్లెటూళ్లోనే పుట్టింది. ఐశ్వర్యంతప్ప ఆ వంశంలో విద్యాగంధం వున్నవారే లేరు. నవలలు, కథలు, సినిమా వార్తలు చదివేమాత్రం చదువు ఆ యింట అరవిందే చదివింది.

అంతమాత్రానికే పొంగి పోయేవాడు ఆమె తండి.

"నా తల్లి చదువుల సరస్వతి. యమ్మేలు చదివినవాడు ఎగరేసుకొనిపోయి పెళ్ళాన్ని చేసుకొంటాడు. నా తల్లి ఈ పాడు వూళ్లో తప్పిబుట్టిందికాని, ఢిల్లీ. బొంబాయి. మద్రాసు, హైదరాబాదుల్లో వుండాల్సిన పిల్ల కాదూ?"

పల్లెటూళ్లో.పుట్టి పెరిగినా, వూరి మోతుబరి రైతుకూతురు కావటం చేత గొప్ప గొప్ప ఆలోచనలు అబ్బేయి అరవిందకు. పైగా నవలల్లు, పత్రికలు చదివి, సినిమాలు చూచి- పట్నవాస జీవితంపట్ల గొప్ప భ్రమల్ని, దాంపత్య జీవితం పట్ల కోరికల్ని పెంచుకొంది.

పాతికేళ్ళ వయసులో యన్టీఆర్ ఎలా వుండివుండేవాడో రూపంలో, అలా వుండాలి తన భర్త. యమ్మే కనీస విద్యార్హత. ధనవంతుడై ఎలాగూ వుండాలి. అదేదో.నవల్లో రాజశేఖరంలాగో, మరో.అలాంటి హీరోలాగో, తనను అపురూపంగా చూచుకొనేవాడై వుండాలి. అన్నిటి కన్నా ముఖ్యం —హైదరాబాద్‌కు తక్కువకాని పట్నంలో పెద్ద వుద్యోగి అయివుండాలి.

మురళీమోహన్ అందగాడు. తెలివిగలవాడు. డిగ్రీలు వున్నవాడు. అయితే చిన్నతనంనుంచి స్వశక్తి మీద ఎక్కొచ్చినవాడు. ఆదర్శాలు పెంచుకొన్నవాడు. నిరుద్యోగి.

అయినా పెళ్ళిచూపుల్లో అతడిని చూచీచూడగానే, అరవిందకు చక్రవర్తులూ, రాజశేఖరాలూ గుర్తుకొచ్చారు. అతనికోసమే ఎన్నో యుగాలుగా ఎదురుచూస్తున్నట్లు, ముందు వెనుకలు చూచుకోకుండా ప్రేమించి పారేసింది. మనసును మూటగట్టి అతని కిచ్చేసింది.

మురళీమోహన్ తల్లిదండ్రులు ఎక్కువ కట్నం అడగలేదన్న కారణంగా ఆ సంబంధాన్ని తండ్రి తిరస్కరించబోతున్నప్పుడు అరవింద ఆయన్తో పోరాడింది.

"వాళ్ళకు నచ్చి లేనట్లా?"

"ఏకుందిగా? నువ్వియ్యకూడ ఏమిటి?"

"ఉద్యోగంకూడా లేదు."

"అయితే యిప్పించు."

వెళ్ళయ్యాక కాని అరవిందకు భర్త 'బాదస్తాలు' తెలియలేదు.

అతని బుర్ర ఆదర్శాల పుట్ట! ఒక రకం పయనియర్!

మామగారి డబ్బుమీద ఆధారపడటం, రెకమెండేషన్లతో వుద్యోగాలు సంపాదించుకోవటం, లేని గొప్పలకు పోవటం... బలహీనుల, అసమర్థుల లక్షణం అన్నది అతని ఆదర్శాల్లో ఒక్కటి. ప్రతివాళ్ళూ స్వయంశక్తి, స్వయం ప్రతిభలకు ప్రాధాన్యత నివ్వాలంటాడు.

తన జీవితానికి యీ ఆదర్శాలను ఆలంబనం చేసుకోబట్టే అతను అప్పర్ డివిజన్ గుమాస్తా అయ్యాడు. ముందు ముందెన్నడో తన ప్రతిభకు గుర్తింపు లభిస్తుందన్న ఆశను మాత్రం విడనాడలేదతను.

చాలీ చాలని అద్దె కొంపలో, గుమాస్తా భార్యగా బతకటం మొదట్లో అరవిందకు చాలా కష్టమనిపించింది. తన కోరికలన్నీ కుప్ప కూలిపోయినట్లు బాధపడింది. పడవల్లాంటి కార్లల్లో భర్తతో తిరగాలని ఆశపడ్డ ఆమె, రిక్షాలో భర్త పక్కన కూర్చొని షికారుకు పోవటానికి సిగ్గుపడింది.

కానీ అతని ప్రేమను, అందాన్ని చూచినప్పుడు, అనుభవించినప్పుడు మాత్రం ఆమెకు రాజశేఖరాలే గుర్తుకొచ్చేవారు. 'అంతంత మాత్రం అందగత్తెన తనను- తన డబ్బును, పలుకుబడిని ఆశించకుండా, యింత అపురూపంగా చూసుకొనే ఆ వ్యక్తి ఎంతటి అమృతమూర్తి- వుదాత్త నాయకుడు' అనుకొని పొంగిపోయేది.

సరిగ్గా ఆ సమయంలో అమృతపు జల్లులా ఆ వార్త తెలిసింది.

* *

"ఆదెమ్మా! యిట్లా పొద్దెక్కి పనిలోకొస్తే యికకుదరదు. తెల్లారుఝామున మూడుగంటలకొస్తేకాని నాకు పని తెమలదు. అయ్యగారు ఆరుగంటలకల్లా తయారయిపోయి ఆఫీసుకు వెళ్ళాలి." ఆదెమ్మను చూస్తూనే అమిత వుత్సాహంగా అంది అరవింద.

ఆదెమ్మ పనిమనిషి. ఆమె వయసుకు వృద్ధాప్యం వచ్చినా, శరీరం మాత్రం యింకారాయిలా, దబ్బుడు పాత్రంలా వుంది. పెట్టే వాళ్ళుంటే గుండెడు బియ్యపు అన్నాన్ని నిమిషంలో గుటకాయ స్వాహా చేయగలదు. బండెడు

వాకిరి వాక్కి చేత్తో క్షణంలో చేసి పారేయగలదు.

ఆమె తెల్లవారు ఝామునే లేస్తుంది. యిల్లిల్లు తిరిగి పాచిపని చేస్తుంది. అంట్లు తోముతుంది. పదకొండు గంటలకు మరికొన్ని యిళ్ళు తిరిగి టిఫిన్ కేరియర్లు సేకరిస్తుంది. వాటిని బుట్టల్లో పెట్టుకొని వెళ్ళి. స్కూల్లో పిల్లల మధ్యాహ్న భోజనసమయానికి అందిస్తుంది. వాళ్ళు భోజనాలు చేశాక తిరిగి టిఫిన్ కేరియర్లను ఆ యా యిండ్లల్లో అప్పగించేసి, మధ్యాహ్నపు పనిలోకి దిగి, మళ్ళీ అంట్లు తోముతుంది. యిళ్ళు ఊడ్చుతుంది! అంతా ముగిసేసరికి చీకటిపడుతుంది.

అలా ఆమె వొక పనిచేస్తే యంత్రం. యింత చేసినా ప్రతిఫలం అంతంత మాత్రమే! పిల్లలు తినగా టిఫిన్ కేరియర్లలో మిగిలిన అన్నమే నికరమైన దక్కుడల!

పాచి పని చేయించుకొనే అమ్మలు చీవాట్లు పెట్టినంతగా తిండి పెట్టరు. ఎంతచేసినా వో మెచ్చుకోలు మాట అనరు. లోపాలు ఎత్తిచూపటమే! ముందొస్తే వెనక అంటారు, ఆలస్యంగా వస్తే ముందు రాలేదని తిట్టారు. కానీ ఆరవింద అలాకాదు.

“యిద్దరం మనుషులం. పైగా గేస్-కుక్కర్లలో వంట. అంత పెందరాడే వచ్చి నన్ను ఎందుకు యిబ్బంది పెట్టావులే అదెమ్మా! కొత్త పొద్దెక్కాక రా మా యింటికి. అసలే నాకు మా యింట్లో సూర్యుడుదయించాకే నిద్రలేచే అలవాటు లేదు.”

అలాంటి అమ్మగారు- యిదేమిటి యిలాగంటుంది!

“ఏమిటే మొద్దూ, అలా గుడ్లు మిటకరించి చూస్తావ్? యికనుంచి ఆఫీసులు, స్కూళ్ళు ఏడుగంటలకేట!”

“అదేంటమ్మగారూ! పాచి మొగాన్నే ఎలా వెళ్తారు ఆపీసులకి?”

“పాచిమొహంతో కాదే పిచ్చి మొహమా! తెల్లవారుఝామున లేవటం ఆరోగ్యకరమని తెలీదా? అసలు పొద్దున వేళప్పుడేట- మనసు ప్రశాంతంగా వుండేది. అంచేత టిఫిను కాఫీలు చేసి వెళ్ళి హాయిగా పని చేసుకోవాలట!”

“అంటే- పెద్దపెద్ద ఆపీసర్లంతా మానాగ నిద్రలేచి పన్లకెళ్ళి, రేత్రి దాకా పని సేత్తారన్నమాట— యిగమీద!”

“యింకానయం- రాత్రిళ్ళు

కూడా అక్కడే పడుకొంటా రన్నావు కాదు! ఒంటిగంటకల్లా ఆఫీసయిపోయి యింటికొస్తారే! యికమీ అయ్యగారితో సాయంత్రం పూట హాయిగా ఎన్ని సినిమాలైనా చూడొచ్చు నను. ఎన్నిషికార్లయినా చెయొచ్చు. నువ్వు మటుకు తెల్లవారు ఝామున, మధ్యాహ్నం రెండింటికే మా ఇంటికి పనికి రావాలిసమా! కావాలంటే మరో పది రూపాయలు ఎక్కువిస్తా"

"అట్టాగేనమ్మగోరూ!" అంది ఆదెమ్మ సంతోషంగా.

• • •

అయితే మర్నాటి పొద్దునకల్లా ఆమె బుర్ర చిక్కుముడి అయింది.

అందరూ తెల్లవారి ఝామున్నే ముందుగా తమ ఇంట్లో పనికి రమ్మనేవారే! ఎవరింటికి వెళ్ళటం? ఎవరిని కాదనటం?

తెల్లారి ఝామున నాలుగు గంటలకి లేస్తే, పదకొండు గంటల దాకా ఏదో యింట్లో పని చేస్తూనే వుంటుందే! మరి ఆ లెక్కన తెల్లారేలోగా అందరి యిళ్ళల్లో పని అయిపోవాలంటే ఎప్పుడు లేవాలి? రాత్రి భోజనాలు కాగానే పాచిపని మొదలపెట్టాలి.

"ఏంటమ్మగోరూ! అనలెందుకంటా యీ మారుపు! మునపటిలాగా నేవుంటే ఏం నట్టం, కట్టం వచ్చిందంటమ్మా!"

ఆరోజు ఆదివారం. అంచేత మురళీమోహన్ ఇంట్లోనే వున్నాడు. ఆదెమ్మ ప్రశ్నకు అరవింద అమిత వుత్సాహంతో, మార్పువల్లరాబోయే లాభాలు చెప్తూండటం విన్నాడు.

"పూర్వకాలంలో గురువులు శిష్యులకు పాఠాలు ఎప్పుడు చెప్పేవారనుకొన్నావ్? బ్రాహ్మీ ముహూర్తంలో - అంటే ఉషోదయానికి పూర్వమన్న మాట! అంతెందుకు- మా పల్లెటూళ్ళలో పొలం పనులకు పదిగంటలకు వెళ్తారనుకొన్నావా ఏమిటి? సూర్యుడు పొడిచేముందే పొలాల్లో వుంటారు. ఆ సమయంలో. శరీరం, మనసు, బుద్ధి- బలంగా, శాంతంగా, స్థిరంగా. చురుగ్గా వుంటాయట! అందుకే చదువుకొనే పిల్లలకు, చెప్పే మేస్టర్లకు, పనులు చేసుకొనే వుద్యోగులకు అది మంచిది.

"అందాకా ఎందుకు- పాచిపని పొద్దున్నే చేయటం మీకు సులువా? మిట్టమధ్యాహ్నం సులవా? ఆలోచించు. పొద్దున పని-మధ్యాహ్నం

విశ్రాంతి - సాయంకాలం పూర్తి కుటుంబంతో సరదాగా షికార్లు, సినిమాలు- ఎంత హాయిగా వుంటుం దనుకొన్నావ్? అసలు చాలా దేశాల్లో యీ విధానమే వుందిట! వైజాం నవాబుగారి విధానం కూడా యిదేట! నా షష్టసాషికి నాకు యీ మార్పు అమిత సంతోషంగా వుందనుకో!"

భార్య సంతోషాన్ని అర్థం చేసుకోగలడు మురళీమోహన్. కాని తన బాధని అరవింద అర్థం చేసుకోగలదా?

పొద్దున్నే లేచి ఆదరాబాదరా ఆఫీసుకెళ్ళాలి. భోజనం, టిఫిన్ అలవాట్లన్నీ మార్చుకోవాలి. బస్సుల్లో కుస్తీలు!

పైగా పొద్దున్నే ఆఫీసులో పనేం సాగుతుంది? పని మిగిలిపోతే ఆఫీసర్లు సాయంకాలందాకా వుండి పొమ్మంటే? కొన్నాళ్ళకది అలవాటు క్రింద మారిపోతే?

ఆలోచించేకొద్దీ భయం... వూహించేకొద్దీ వణుకు....

ఆదెమ్మకివన్నీ అర్థంకాలేదు. కావాలనీ, చెప్పేవాళ్ళ వుద్దేశ్యమూ కాదు.

.కాపీ యిందులో చాలా గొడవే వుందని అర్థమయిందామెకు. అయితే అదంతా తనకు సంబంధించని గొడవ- తనకనవసరం.

అయితే మర్నాడు పొద్దున ఆమె గుండెల్లో బాంబు పేలింది.

"ఆదెమ్మా! స్కూళ్ళు ఏడు గంటలకే మారుస్తారట! అలా మారిస్తే బాబుకు యింక నువ్వు టిఫిన్ కేరియరు తీసుకుపోవల్సిన అవసరం వుండదు. అప్పుడు చెప్పలేదని అంటావని, యిప్పుడే చెప్తున్నా!"

టిఫిన్ కేరియర్లు యిచ్చివంపే అన్ని యిళ్ళల్లో యిదేమాట!

పెద్ద కష్టం లేకుండా ఎక్కువ లాభంవచ్చే పని అదే!

కేరియర్‌కిచ్చే డబ్బు కాకుండా, కేరియర్లలో పిల్లలు తిని వదిలేయగా మిగిలిన అన్నం....

అందరిలాగా, ఫుట్‌పాత్ మీద అన్నం ముద్దలు అమ్మకొనేవాళ్ళకు ఎంగిలి పదార్థాలు అమ్మితే బోలెడంత డబ్బు! అలా అమ్ముమని ఎంతమంది తనవెంట పడలేదు?

మొదట్లో ఎంగిలి వస్తువులు అమ్మటం మంచిదికాదని సంశ

యారింది. కానీ యిటీవల బరువు బాధ్యతలు పెరిగేక ఆదెమ్మ కూడా మిగిలిన ఎంగిలి పదార్థాలను జాగ్రత్తచేసి అమ్ముకోక తప్పలేదు.

అటు కేటరర్ల మీద వచ్చే నెల జీతం పోయి__యిటు మిగిలిన పదార్థాలు అమ్ముకొంటే వచ్చే లాభమూ పోయి.... ఆమెకు భవిష్యత్తు భయంకరంగా కన్పించింది.

పిల్లలు ఆకలితో ఆర్తనాదాలు చేస్తూ ఆదెమ్మ కళ్ళముందు ప్రత్యక్షమయ్యారు! ప్రస్తుతానికది వూహే. కానీ రేపు అది నిజం!

"అమ్మగోరూ! ఒళ్ళు ఉయాముణా ఆపీదు ఉయముణా మార్చేటాన్ని గూర్చి నిన్న అయ్యగోరు. తమరు అన్ని మాటాడుకొన్నారుగందా! గవర్నమెంటోళ్ళు మమ్మల్ని గురించి ఏవన్నా ఆలోసించేరా!"

"ఏంటీ! నిన్ను గురించి గవర్నమెంటు ఆలోచించటానికి నువ్వేమన్నా గవర్నరువా- అయ్యేయస్ ఆఫీసరువా! కనీసం గుమాస్తా అన్నా కాదే! యిది నిన్ను గురించిన విషయం కాదే పిచ్చిమొహమా! మా సమస్యయిది. నీకెందుకివన్నీ! ఆ తోమే అంట్లేదో తెల్లవారు ఝామునేవచ్చి తోమి పారేసి పోరాదూ?"

ఆదెమ్మ మనస్సు చివుక్కుమంది. మార్పు చేసేముందు అన్నన్ని విషయాలు ఆలోచించిన గవర్నమెంటు తమ విషయమే ఆలోచించ లేదన్నమాట! తమకు రాబోయే కష్టాలని, బాధలని, సమస్యలని వూహించనైనా లేదన్నమాట!

"అంతేలేమ్మా! ఓట్లప్పుడు తప్ప మా మంచిచెడ్డల్ని ఎవరాలో చిస్తారు? మమ్మల్ని ఏ నాయకుండో లెక్కలోకి తీసుకొన్నారా? [illegible], ఓటు వున్నోళ్ళకే కాలం యిది. కష్టపడే గొడ్డులం. గేదెలిచ్చే పాలనిసి సూత్తారు కాని దాని యిటాన్నడిగి గడ్డి పెడ్తారా! కట్టమే మాకెప్పటికీ దక్కుదల. కుళ్ళినాక పులి తరాకుల్నీ ఎరువుగా వాడుకో వచ్చని.. యింట్లో దాసిపెట్టు కొంటారా- యిసిరి సెత్తకుండీలో పారేత్తారు కాని!"

యిన్ని మాటల్ని ఆ విందరాలో అనే ధైర్యం లేకపోయింది ఆదెమ్మకు. అని మటుకు ఏమిటి లాభం? అందుకే మనసులో గొణుక్కొంది, నిశ్శబ్దంగా ఏడ్చింది. *